www.jananinadam.com RNI NO:TGTEL/25/A0870 Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక



**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ. అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న జననినాదం తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460



బుధవారం12 -08- 2026 | సంపుటి : 2 సంచిక : 106 | ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad | ఎడిటర్ : జాధవ్ రోహిదాష్ Editor: JADAV ROHIDAS | పేజీలు : 04 | వెల: రూ.2.00

Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com




## జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్'

# అతి పెద్ద పరిశోధన కేంద్రం

**హైదరాబాద్ 11:** గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామ్జెన్' జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో బేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు.సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు.యామ్జెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసి ని ఏర్పాటు చేసిన

## అధికారులకు సిఎం రేవంత్

# దిశానిర్దేశం

**గ్లోబల్ సమ్మిట్కు భారీగా ఏర్పాట్లు**
**అంతర్జాతీయ దృష్టి ఆకర్శించేలా సమ్మిట్**



హైదరాబాద్, ఆగస్ట్11: తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసియర్లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిటీకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాపార రంగంలోని సెక్టార్లలో గుర్తింపు పొంచిన ప్రముఖులను సమ్మిట్లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఏడాని నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను వివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సలహాదారులు రామకృష్ణారావు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## యూపిఐ పేమెంట్స్పై ఛార్జీలు ఉండవు

**కమ్యూనిస్టులు అబద్ధాల ప్రచారం తగదన్న నిర్మల**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** రూపే, గూగుల్ప, ఫోన్పే వంటి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్ (యూపీఐ)ల ద్వారా జరిపే లావాదేవీలకు ఛార్జీలు వసూలు చేస్తారన్న అనుమానాలపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఇలాంటివి ప్రచారం చేయడంలో ముందుంటారని ఎద్దేవా చేశారు. వీటిని ఉపయోగించే వినియోగదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరని పేర్కొన్నారు. కొన్ని రకాల లావాదేవీలకు మాత్రర భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)

2వ పేజీలో...

## టెసరాక్ట్ కంపెనీకి అప్పనంగా భూమి కేటాయించారు

**చదువురాని రేవంత్ బ్రదర్స్ అందరూ సూట్లు కోట్లు వేసుకుని చైర్మన్లు అయిపోతున్నరు**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్11:** పక్క రాష్ట్రం కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్య సతీమణికి.. అక్కడి ప్రభుత్వం మూడెకరాల భూమి కేటాయించిందని బీజేపీ ఫిర్యాదు చేసింది. ఆ వ్యవహారంలో లోకాయుక్త తీర్పు ఇచ్చింది. చివరికి సిద్ధరామయ్య రాజీనామా చేసేదాకా వచ్చిందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.తెలంగాణలో టెసరాక్ట్ అనే కంపెనీకి అప్పనంగా భూమి కేటాయించారు. టెసరాక్ట్ కంపెనీకి రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డి చైర్మన్. ఆ విషయాన్ని కొండల్ రెడ్డే లింక్డ్ ఇన్ ప్రొఫైల్లో పెట్టుకున్నారు. టెసరాక్ట్ కంపెనీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పరికరాలను తయారు చేస్తుందట. అమెరికా ఎంబసీ ప్రతినిధితో హైదరాబాద్లో మీటింగ్ కూడా పెట్టారు. యూఎస్ ఇండియా స్ట్రాటెజిక్ డెవలప్ మెంట్ ఫోరంలో.. ఎగ్జిక్యూటివ్ బోర్డులో కొండల్ రెడ్డికి సభ్యత్వం ఇచ్చారని అన్నారు.కొండల్ రెడ్డి ఏం చదివారో నాకు తెలియదు. టెసరాక్ట్ కంపెనీకి కొండల్ రెడ్డి చైర్మన్ అని అమెరికా కాన్సులేట్ కూడా స్టేట్ మెంట్ ఇచ్చింది.చదువురాని రేవంత్ బ్రదర్స్ అందరూ సూట్లు కోట్లు వేసుకుని చైర్మన్లు అయిపోతున్నరు. టెసరాక్ట్ కంపెనీ కథ ఏంటని మేం ఆరా తీశాం. ఆ కంపెనీ ఫోన్ నంబర్ 123456789 అట. ఇలాంటి నంబర్లు ఉంటాయని మాకు తెల్వదు.

## రాజీవ్ రహదారి బాధితులకు


# న్యాయమైన పరిహారం ఇవ్వాలి

2వ పేజీలో...

**: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు**




ఖార్ఖానాలో రాజీవ్ రహదారి బాధితుల ఆందోళనకు మద్దతురాజీవ్ రహదారి విస్తరణ ప్రాజెక్టులో భూములు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఖార్ఖానాలో బాధితులు నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొని వారికి బీజేపీ తరఫున సంఘీభావం తెలిపారు. రోడ్డు విస్తరణ కోసం భూములు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న ప్రజలు అభివృద్ధికి వ్యతిరేకం కాదని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనం కోసం చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు



## తక్షణమే రిజర్వాయర్లకు 30టి


# ఎంసి ల నీటిని ఎత్తిపోయాలి

**: మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట 11:** రైతు లు నీటిని ఎత్తి పోస్తారని ఎదురు చూస్తున్నారు రిజర్వాయర్ల దుస్థితి చూస్తే మాత్రం దుఃఖం వస్తోందని ఆవేదన వ్యక్తం చేసిన హరీష్ రావు. జిల్లా లో వచ్చే ఏడాది జులై నాటికీ సాగు, త్రాగు నీటి కొరత లేకుండా చూడాలిరైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సమన్వయం తో పని చేయాలిజిల్లా కలెక్టర్ కి, ఇరిగేషన్ అడ్వైజరి కమిటీ కి లేఖ వ్రాసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. జిల్లాలోని రిజర్వాయర్లలో తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం మరియు వచ్చే వానాకాలం వరకు జిల్లా రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మళ్లీ వేసవిలో నీటిని ఎత్తిపోయడానికి మిడ్ మానేరులో సరిపడా నీళ్లను నిల్వ చేసేలా చర్యలు

### ఇరాన్ నుంచి పొంచివున్న ముప్పు

సైనిక విమానంలో ట్రంప్ రహస్య ప్రయాణం 'వాషింగ్టన్ పోస్ట్' ఒక సంచలన కథనం



వాషింగ్టన్, ఆగస్ట్ 11:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో టర్కీ పర్యటన ముగించుకుని తిరిగి వెళ్తున్నప్పుడు బ్రిటన్ కు అత్యంత రహస్యంగా ప్రయాణించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికల భయంతో ఆయన అందరూ భావించినట్లు ఎయిర్ ఫోర్స్ వన్లో కాకుండా మరో సైనిక

## చేయూత కొత్త పింఛన్లకు

# దరఖాస్తుల స్వీకరణ



**హైదరాబాద్11:** అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు లేదు.గతంలో అమల్లో ఉన్న మార్గదర్శకాల ప్రకారమే కొత్త పింఛన్లుఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణఅర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు.

కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ






# కొలంబియాలో... భూకంపం

## 132 మంది మృతి

**శిథిలాల కింద పెద్ద సంఖ్యలో ప్రజలు**
**సహాయక చర్యలు ముమ్మరం చేసిన ప్రభుత్వం**

న్యూఢిల్లీ, ఆగస్ట్ 11: కొలంబియాలో భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది.సోమవారం పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో ఏర్పడిన భూకంపం ధాటికి మరణించిన వారి సంఖ్య 132కు చేరింది.

2వ పేజీలో...

## ఎస్ఐఆర్లో అర్హులైన ఓటర్లకు

# అన్యాయం జరగకుండా బీఆర్ఎస్ పోరాటం

**74 లక్షల ఓట్లు అన్కలెక్టబుల్గా ఉండటం ఆందోళనకరం**

**ముసాయిదా ఓటరు జాబితా తర్వాత జిల్లాల వారీగా సమావేశాలు**

**న్యాయపరంగా, పార్టీ పరంగా అర్హుల ఓట్ల పరిరక్షణకు కార్యాచరణ**

**తెలంగాణ భవన్లో పార్టీ ఎస్ఐఆర్ కమిటీతో సమావేశమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..**



2వ పేజీలో...

# టెసరాక్ట్ కంపెనీకి అప్పనంగా భూమి కేటాయించారు

మొదటిపేజీ తరువాయి...



రేవంత్ ఏదైనా కొత్త టెక్నాలజీ కనిపెట్టిండేమో? విచిత్రం ఏంటంటే టెసరాక్ట్ కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేడు. 2025 మార్చి 31 నాడు వాళ్లే ప్రకటన చేశారు. తమ కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేడని చెప్పారు. ఊరూ పేరు లేని చోట ఆ కంపెనీ అడ్రస్ ఉంది. టెసరాక్ట్ మూలధనం లక్ష రూపాయలు. ఈ కంపెనీకి రేవంత్ ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టింది. ఈ కంపెనీకి రేవంత్ ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టింది. ఐదెకరాల భూమిని కేటాయించి, అతిపెద్ద కుంభకోణానికి పాల్పడ్డారు. ఇది అనుముల కొండల్ రెడ్డి వ్యవహారం. అనుముల జగదీష్ రెడ్డి అని రేవంత్కు ఇంకో తమ్ముడు ఉన్నాడు. జగదీష్ రెడ్డి అమెరికాలో ఉంటాడు. రేవంత్ అమెరికా పర్యటనకు పోయినప్పుడు.. వెయ్యి కోట్ల డీల్ చేసుకున్నరు. స్వచ్ఛ్ బయో అనే కంపెనీతో ఒక మెమోరాండం సైన్ చేశారు. వాళ్లకు ఎక్కడ భూములు ఇచ్చారో తవ్వి తీస్తామని అన్నారు. రేవంత్ బామ్మర్ది సృజన్ రెడ్డికి రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టు దక్కింది. రేవంత్ రెడ్డి, మోడీ ప్రభుత్వం కలిసి నడుపుతున్న సింగరేణిలో.. సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే అంతా నడుస్తోంది. సైట్ విజిటేషన్ సర్టిఫికెట్లు, వేల కోట్ల కుంభకోణాలు అన్నీ బయటపెట్టినం. ఈ పరంపరలో మేం బయటపెట్టిన తాజా కుంభకోణమే టెసరాక్ట్. వడ్డించే వాడే మనోడే అన్నట్టు భూములు కొట్టేశారు. రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని రూ.7 కోట్లకు రాసిచ్చారు. ఇది స్కాం కాదా? పక్క రాష్ట్రం కర్ణాటకలో ఒక న్యాయం, ఇక్కడ ఒక న్యాయమా? టెసరాక్ట్ కథేంటో తేల్చేదాకా వదిలిపెట్టం. ఆ కంపెనీకి, ముఖ్యమంత్రి సోదరుడికి ఏ సంబంధం లేదని శ్రీధర్ బాబు అంటున్నడు. చైర్మన్ అనుముల కొండల్ రెడ్డి అని వాళ్లే ప్రొఫైల్లో రాసుకున్నరు. కానీ మంత్రి శ్రీధర్ బాబు సిగ్గులేకుండా బుకాయిస్తున్నరు. అసలు ఇవన్నీ మంత్రికి తెలిసి జరుగుతున్నాయా? మీ శాఖలో ఏం జరుగుతుందో మీకు తెలుస్తుందా శ్రీధర్ బాబు గారు? ఈ భూకేటాయింపుల కుంభకోణంలో ఎవరినీ వదిలిపెట్టం. ముఖ్యమంత్రి సోదరులైతే ఏమైనా చేయొచ్చా? సీఎం అన్న తిరుపతి రెడ్డికి ఏ అధికారిక హోదా ఉంది. కలెక్టర్లు, ఎస్పీలు ఆయనకు వంగివంగి దండాలు పెడుతున్నరని అన్నారు.

# చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

మొదటిపేజీ తరువాయి...



ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎలిజిబిలిటీ క్రైటీరియానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రామాణికంగా తీసుకుంటోంది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హతను పరిశీలిస్తారు. ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో దరఖాస్తు చేసి, అవసరమైన అన్ని పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత నిర్ధారణ కోసం సంబంధిత శాఖల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను పొందేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారు. వితంతువులకు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, చేనేత కార్మికులకు చేనేత–జౌళి శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ అవసరం. దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్దేశిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత అర్హుల జాబితాను జిల్లా స్థాయికి పంపి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్ మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తారు. ప్రతి అర్హుడికి చేయూత అందించాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు కూడా బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా ప్రతి అర్హత కలిగిన వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకోవడం, అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో సహకరించాలని సూచించారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31, 2026 వరకు స్వీకరిస్తారు. దరఖాస్తులతో పాటు వివరాలను చేయూత పోర్టల్లో నమోదు చేసే ప్రక్రియను కూడా వెంటనే చేపట్టనున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో ఉన్న అర్హత నిబంధనలనే కొనసాగిస్తూ, అర్హులైన వారికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసింది.

# తక్షణమే రిజర్వాయర్లకు 30టీఎంసి ల నీటిని ఎత్తిపోయాలి

మొదటిపేజీ తరువాయి...

చేపట్టాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు జిల్లా కలెక్టర్ కి, ఇరిగిషన్ అడ్వైజరి కమిటీకి లేఖ వ్రాసారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశం సందర్భంగా జిల్లా కలెక్టర్ కి హరీష్ రావు లేఖ వ్రాసి పలు అంశాలు కమిటీ ద్రుష్టి కి తెచ్చారు. ఎల్నినో ప్రభావంతో జిల్లా స్థాయిలో ఇరిగేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహిసున్న నేపథ్యంలో మీ దృష్టికి కొన్ని అంశాలు తెస్తున్నానని లేఖలో పేర్కొన్నారు. ఈ అంశాలపై తక్షణమే చర్యలు చేపడితే వచ్చే వానాకాలం వరకు ఎల్నినో ప్రభావాన్ని అధిగమించగలరని లేఖ ద్వారా కోరారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను నిర్మించుకున్నాము. ప్రతీఏటా ఈ సమయం వరకే రిజర్వాయర్లలోకి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు రిజర్వాయర్ నుండి నీటిని ఎత్తిపోయడం జరిగేది. కానీ ఈసారి ఇంకా ఎత్తి పోతలు ప్రారంభించలేదన్నారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు ప్రస్తుతం డెడ్స్టోరేజీలో ఉన్నాయి. వీటిని వెంటనే నింపాల్సి ఉంది. అదే విధంగా కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లు అడుగంటే పరిస్థితిలో ఉన్నాయన్నారు. ఈ రిజర్వాయర్లలోకి తక్షణమే 30



టీఎంసీల నీటిని ఎత్తిపోసి చెరువులు,కుంటలు మరియు చెక్ డ్యాంలు నింపి పెట్టాలని కోరుచున్నాను. దీని వల్ల భూగర్భజలాలు పెరిగి ఈ వానాకాలం పంటల సీజన్లో జిల్లాలోని రైతులకు ప్రయోజనంగా ఉంటుందని చెప్పారు.

# జీనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' అతి పెద్ద పరిశోధన కేంద్రం

మొదటిపేజీ తరువాయి...

విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌవరమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యతనిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ రహదారి బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి...

అందరూ సహకరిస్తున్నారని, అయితే తమ ఆస్తులను త్యాగం చేస్తున్న ప్రజలకు సరైన విలువతో కూడిన న్యాయమైన పరిహారం అందాల్సిన అవసరం ఉందన్నారు. తూంకుంట ప్రాంతంలో భూముల పరిహారాన్ని పెంచిన విధంగా, రాజీవ్ రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న ఖార్ఖానా ప్రాంత ప్రజలకు కూడా తగిన మేర పరిహారం పెంచాలని ఆయన కోరారు. తూనికుంటలో పెంచిన పరిహారం కంటే ఈ ప్రాంతం మరింత ఖరీదైన అర్బన్ ప్రాంతమని, అలాంటి పరిస్థితుల్లో ఇక్కడ తక్కువ పరిహారం ఇవ్వడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తూంకుంటలో ఏ మేరకు పరిహారం పెంచిందో, అదే విధంగా ఇక్కడ కూడా సముచితమైన శాతం మేర పరిహారం పెంచి బాధితులకు న్యాయం చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనం కోసం తమ భూములు, ఇళ్లు, ఆస్తులను త్యాగం చేస్తున్న బాధితుల త్యాగాన్ని ప్రభుత్వం గుర్తించాలని, వారికి న్యాయమైన పరిహారం అందించడం ద్వారా వారి పట్ల న్యాయం చేయాలని ఆయన అన్నారు. బాధితులు చేస్తున్న న్యాయమైన డిమాండ్కు భారతీయ జనతా పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

# ఇరాన్ నుంచి పొంచివున్న ముప్పు

మొదటిపేజీ తరువాయి...

విమానంలో రహస్యంగా ప్రయాణించారని ఆ కథనం పేర్కొన్నది. వివరాల్లోకి వెళ్తే.. టర్కీ రాజధాని అంకారాలో నాటో సదస్సు ముగిశాక ట్రంప్.. కెమెరాల ముందు పాత ఎయిర్ఫోర్స్ వన్ విమానం ఎక్కారు. అయితే ఆ తర్వాత ఆయనను ఒక ఎయిర్పోర్ట్ క్యాటరింగ్ ట్రక్కు ద్వారా రహస్యంగా మరోచోట ఉన్న చిన్న సైనిక విమానం (ఎయిర్ ఫోర్స్ సి–32ఏ) వద్దకు తరలించారు. ఆ విమానంలోనే ఆయన బ్రిటన్ కు చేరుకున్నారని అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. ట్రంప్ ప్రయాణిస్తున్నట్లు అందరూ భావించిన ఎయిర్ఫోర్స్ వన్ విమానం కూడా కొన్ని నిమిషాల తేడాతో అక్కడికి చేరుకుంది. పాత జ్ఞాపకాల కోసం ఈ విమానంలో ప్రయాణిస్తున్నట్లు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేసినప్పటికీ అసలు కారణం ఇరాన్ నుంచి పొంచి ఉన్న భద్రతా ముప్పేనని స్పష్టమవుతోంది. ఈ కథనంపై వైట్ హౌస్ స్పందిస్తూ.. ' అధ్యక్షుడిపై అమెరికా శత్రువులు కన్నేశారు. వారి నుంచి రక్షణ కల్పించడానికి మా వద్ద ఉన్న అన్ని మార్గాలను ఉపయోగిస్తాం' అని కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవ్ చుంగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఈ రహస్య ప్రయాణంపై పెంటగన్ ఇంకా స్పందించలేదు.

# యూపిఐ పేమెంట్స్పై ఛార్జీలు ఉండవు

మొదటిపేజీ తరువాయి...

వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీనిని ఇంకా ఖరారు చేయలేదని, తరువాత నోటిఫికేషన్ ఇస్తా మని చెప్పారు. ఛార్జీలు ఛార్జీలు వసూలు చేసేం దుకు వీలు కలిగేంచేలా చట్టాన్ని సవరి ంచామే తప్ప, వినియోగదారుల నుంచి ఇప్పటికిప్పుడు వసూలు చేయడానికి కాదని చెప్పారు. ఏ వస్తువుపై ఎండీఆర్ వసూలు చేయాలి, ఎంత ధరకు పరిమితం చేయాలన్న దాన్ని తరువాత నిర్ణయిస్తామని తెలిపారు. యూపీఐ విధానాన్ని 2016లో ప్రారంభించగా, అప్పటి నుంచి ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అది కొనసాగుతుందని తెలిపారు. చిరు వ్యాపారులపై భారం పడబోదన్నారు. అమెరికా ఒత్తిడి మేరకే యూపీఐ చెల్లింపులపై రుసుములు వసూలు చేయాలని నిర్ణయించారని సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'కమ్యూనిస్టులే అంత... వాస్తవాలు చెప్పరు. ఆపై వక్రీకరణలు' అని వ్యాఖ్యానించారు. సమాధానం వినే ధైర్యం లేని పిరికిపందలని విమర్శించారు

# ఎస్ఐఆర్లో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా బీఆర్ఎస్ పోరాటం

మొదటిపేజీ తరువాయి...

**హైదరాబాద్11:** ఎస్ఐఆర్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఓటర్లకు ఎదురవుతున్న సమస్యలు, అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగించకుండా తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో మొత్తం 3 కోట్ల 39 లక్షల ఓట్లు ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. అందులో దాదాపు 73 నుంచి 74 లక్షల ఓట్లు 'అన్కలెక్టబుల్'గా ఉన్నాయని, వాటి నుంచి ఇప్పటివరకు స్పందన రాలేదని ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారం చెబుతోందన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు అన్కలెక్టబుల్గా ఉండటం, వాటిలో చాలా ఓట్లు తొలగించబడే అవకాశం ఉందనే పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని అన్నారు. అదేవిధంగా సుమారు 60 లక్షల ఓట్లలో అనామలీస్ ఉన్నట్లు సమాచారం ఉందని కేటీఆర్ తెలిపారు. మొత్తంగా చూస్తే ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే నాటికి కేవలం సుమారు రెండు కోట్ల ఓట్లు మాత్రమే ఎలాంటి సమస్యలు లేకుండా మిగిలే పరిస్థితి కనిపిస్తోందని, మిగిలిన ఓట్లలో కొన్ని తొలగిపోయే అవకాశం ఉండగా, మరికొన్నింటిలో తప్పులు, అనుమానాలు ఉన్నట్లు ఎన్నికల కమిషన్ నుంచి సమాచారం వస్తోందన్నారు. అర్హులైన ఒక్క ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చూడటం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని ఎన్నికల అధికారులు చెబుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఆ జాబితా ప్రచురణ అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఇప్పటికే పార్టీ లీగల్ సెల్తో సమావేశమై, న్యాయ నిపుణుల సలహాలు కూడా తీసుకున్నామని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయినట్లయితే వారికి న్యాయం చేయడానికి ఎలాంటి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి, పార్టీ పరంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, బాధిత ఓటర్లకు అండగా పార్టీ యంత్రాంగాన్ని ఏ విధంగా క్రియాశీలం చేయాలనే అంశాలపై న్యాయ నిపుణులతో చర్చించామని కేటీఆర్ చెప్పారు. ఆగస్టు 13, 14 తేదీల్లో కొన్ని సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నామని, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్తో చర్చించిన అనంతరం ఆ సమావేశాల పూర్తి వివరాలు, కార్యాచరణను వెల్లడిస్తామని తెలిపారు. జిల్లాల వారీగా జరిగే సమావేశాల్లో స్థానిక పరిస్థితులను సమీక్షించి, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిజంగా అర్హులైన కొంతమంది ఓటర్ల పేర్లు కూడా తొలగించబడుతున్నట్లు కనిపిస్తోందని కేటీఆర్ అన్నారు. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా న్యాయపరంగా, పార్టీ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో పూర్తిగా అప్రమత్తం చేసి, ఓటర్లకు అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు.


# కొలంబియాలో...భూకంపం

మొదటిపేజీ తరువాయి...

మరో 570 మంది గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భూకంప కేంద్రం చోకో ప్రాంతంలోని శాన్ జోసె డెల్ పాల్మార్ సమీపంలో ఉన్నట్టు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూకంపం సుమారు 107 కిలోమీటర్ల లోతులో సంభవించింది. దీని ప్రకంపనలు కొలంబియాలోని కాళీ, పెరీరా, మానిజాలెస్, బొగోటా తదితర ప్రాంతాలతోపాటు పొరుగు దేశాల్లోనూ నమోదయ్యాయి. భూకంప ధాటికి అనేక ప్రాంతాల్లో భవనాలు కుప్పకూలాయి. కాలీలోని ఓ ఆసుపత్రిలో పీడియాట్రిక్, నియోనేటల్ విభాగాలు దెబ్బతిన్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న పలువుర్ని రక్షణ సిబ్బంది వెలికితీశారు. ఆసుపత్రుల్లోని కొంతమంది రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలీలోనే 30 శాతం వరకు ఆసుపత్రి నిర్మాణం దెబ్బతిన్నట్టు స్థానిక అధికారులు తెలిపారు. పెరీరా, కాలీ నగరాల్లో భవనాల కూలిపోవడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది, మానిజాలెస్లోని చారిత్రక కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. పలుఇళ్లు ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు కూడా దెబ్బతిన్నాయి. భూకంప తీవ్రత దృష్ట్యా కొలంబియా ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించింది. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు సైనిక బలగాలను రంగంలోకి దించింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసుకురావడమే తమ తొలి ప్రాధాన్యమని అధ్యక్షుడు అబెలార్డో లా ఎస్ప్రిల్లా తెలిపారు. సైన్యం ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ సిబ్బంది, శిథిలాల్లో చిక్కుకున్న వారిని గుర్తించే పరికరాలు, శునక దళాలను రంగంలోకి దించింది. రిమోట్ ప్రాంతాల్లో రహదారులు, సమాచార వ్యవస్థలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భూకంపం కారణంగా పశ్చిమకొలంబియాలోని పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. పరీరా, మానిజాలెస్, ఆర్మేనియా కార్టాగో, బ్యూనవెంచురా తదితర విమానాశ్రయాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల వైద్య, ప్రభుత్వ విమానాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మరోవైపు కొలంబియాకు సాయం చేసేందుకు పలు దేశాలు ముందుకొచ్చాయి. మెక్సికో 47 మంది రెస్క్యూ సిబ్బంది, శిక్షణ పొందిన శునకాలు, ప్రత్యేక పరికరాలను పంపేందుకు సిద్ధమైంది. ఎల్ సాల్వడార్, మెక్సికోటోపాటు అమెరికా కూడా అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది.

# రాజానగరం హైస్కూల్లో విద్యార్థులతో పనులు. పర్యవేక్షణ మరిచిన ఎంఇఓ

**శిరివెళ్ల 11:** మండల పరిధిలోని రాజనగరం గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులతో తరచూ గ్రౌండ్ లోని ఇచ్చి మొక్కలను కలుపుగడ్డిని విద్యార్థులచే ఉపాధ్యాయులు దగ్గర ఉండి చేపిస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్చుకుని ప్రయోజకులు కావాలని తల్లిదండ్రులు పాఠశాలకు పంపిస్తే రాజానగరం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉదయం బడి గంటల సమయంలోనే పనులు చేపించడం జరుగుతుంది. ఎంఈఓ 2 నాగార్జున రెడ్డి ఆన్లైన్ లో పాఠశాల సందర్శన పరిశీలన చూసుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఏమాత్రం పట్టించుకోడు లేదన్న అపవాదు ఆరోపణలు విమర్శలు మండల విద్యాశాఖలో కొనసాగుతున్నాయి. పిచ్చి మొక్కలు గడ్డి మొక్కలు ఇతర ఫంగస్ అలర్జీ మొక్కల వల్ల విద్యార్థులు పలు శ్వాస కోసం వ్యాధులు చర్మవ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తరచూ విద్యార్థులతో ప్లే గ్రౌండ్



లో చేపించడం బడి గంటలకు విద్యాబోధనకు స్వస్తి పలకడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ఎంఈఓపై జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు

# ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి ఆగష్టు 11:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ కె.హరిత సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితోపాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బోరుబావులు ఉన్న రైతులు సైతం వరి సాగుకు అవసరమైన నీరు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందా? అనే అంశాన్ని ముందుగానే పరిశీలించుకోవాలని అన్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ, వరి సాగుకు అవసరమైన స్థాయిలో నీటి లభ్యత ఉండకపోవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంచుకోవడం ద్వారా రైతులు అధిక దిగుబడులతోపాటు మంచి లాభాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికలో రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుందని కలెక్టర్ కె.హరిత తెలిపారు. మండల, గ్రామస్థాయిలో ప్రణాళికాబద్ధంగా కార్డుల పంపిణీ చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.జిల్లావ్యాప్తంగా ఇప్పటికే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని



పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని చెప్పారు. ఎక్కడైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తిస్తే ప్రజలు వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

# విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

**యువరాజ్ మర్మాట్**

**మహిళ డిగ్రీ కళాశాల తనిఖీ చేసిన అదనపు కలెక్టర్**

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి ఆగష్టు 11:**ప్రైవేటు అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, విద్యార్థుల వసతులను పరిశీలించారు.అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడి బోధన, కళాశాలలో అందుతున్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. అద్దె భవనంలో అరకొర వసతులతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు



మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అద్దె భవనంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాశాలకు సొంత భవనం నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

**సంఘటన్ సృజన్ అభియాన్‌తో పార్టీకి పటిష్ట పునాది**

**డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కనియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యాంనాయక్**




**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి ఆగష్టు 11:** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు మొహ్మద్ సుజాయిత్ ఖాన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సుగుణక్కతో పాటు అసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ కీలకమన్నారు. గ్రామాలు, బూత్‌ల వారీగా పార్టీని బలోపేతం చేయడంతో పాటు కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యం కల్పించడమే కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.అజ్మీరా శ్యాంనాయక్ మాట్లాడుతూ మండల, గ్రామ, బూత్ స్థాయిల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే పార్టీ మరింత బలమైన శక్తిగా ఎదుగుతుందని అన్నారు. కెరమెరి మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో డీసీసీ సెక్రటరీ రాథోడ్ శంకర్, ఆత్మ కమిటీ సభ్యులు గోగర్ల రాజయ్య, రాథోడ్ ప్రకాశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాజీద్ దేశ్‌ముఖ్, రాథోడ్ దేవిదాస్, ఆత్రం తిరుపతి, మందాడే విశ్వనాథ్, కోట్రంగే నాగు, ఆత్రం తిరుపతి, కోట్రంగి హనుమంతు, మొహర్లే నగేష్, సిందే హనుమంతు, రాథోడ్ జలపత్, సిడాం జగన్నాథ్, మొహర్లే బాబూరావు, తోరత్ ఉత్తమ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ నేపథ్యంలో ఉచిత కోచింగ్ ఏర్పాటు చేయాలి

**జననినాదం క్యాతన్‌పల్లి,ఆగస్టు 11:**ఇటీవల పోలీస్ శాఖలో ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో, పట్టణంలోని నిరుద్యోగ యువతకు ఉచిత పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజా జాగృతి సమితి అధ్యక్షుడు రాజలింగు మోతె మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో రిప్రజెంటేషన్ అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అభ్యర్థులు ప్రైవేట్ కోచింగ్ ఫీజులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల మున్సిపాలిటీ సామాజిక బాధ్యతగా భావించి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాత పరీక్షలతో పాటు ఫిజికల్ ట్రైనింగ్, స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు




తదితర సౌకర్యాలను ఉచితంగా అందించాలని కోరారు. పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చిన ఈ సమయంలోనే ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేల్పుల వెంకటస్వామి, రామిళ్ళ మల్లేష్,ఎట్టం లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి ఆగష్టు 11:** నెల 15వ తేదీన మంచిర్యాల జిల్లాలో నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్,జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు లతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని,అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గౌరవ వందనం, మంచిర్యాల,నస్పూర్ మండలాల తహసిల్దార్ల సంయుక్త ఆధ్వర్యంలో కుర్చీలు, ఇతర



ఏర్పాట్లు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో త్రాగునీరు,పారిశుద్ధ్య నిర్వహణ, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథి సందేశం,జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారులు, అనధికారులు, ప్రముఖులు,మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు,ప్రజలు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రశంసా పత్రాల పంపిణీ,పతాక ఆవిష్కరణ,వేదిక అలంకరణ,పుష్పగు చ్ఛాలు,వేదిక తయారీ, టెంట్, కుర్చీలు,సౌండ్ సిస్టం, మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం,నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక,వైద్య సేవలు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.అన్ని శాఖల అధికారులు,సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని, వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్,మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, మంచిర్యాల ఎసిపి ప్రకాష్,వివిధ శాఖల అధికారులు,పోలీస్ అధికారులు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇనుప సామాగ్రినీ స్వాధీనం చేసుకున్న ఎస్ అండ్ పి సి సిబ్బంది

**జననినాదం,క్యాతనపల్లి ఆగస్టు 11:**సింగరేణికి సంబంధించినా ఇనుప సామాగ్రిని డీసీఎం వ్యాన్ లో దొంగతనంగా తరలిస్తుండగా మందమర్రి ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం స్వాధీనం చేసుకున్నామని సెక్యూరిటీ ఆఫీసర్ కె వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూసింగరేణి కి సంబంధించిన ఇనుప సామాగ్రి ని బెల్లంపల్లికి చెందిన స్క్రాప్ వ్యాపారి ఎస్.కే. సలీమ్, ఏపీ 15 టీబి 4555 నంబర్ గల ఐచర్ వ్యాన్‌లో తరలిస్తుండగా మందమర్రి జిఎం కార్యాలయం సమీపంలో పట్టుకున్నామని తెలిపారు.ఇనుప సామాను




ఐచర్ వ్యాన్ లో తరలిస్తున్నారని ఇంటలిజెన్స్ కే శ్రీనివాస్ రావుకి నమ్మదగిన సమాచారం మేరకు ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కి సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి జూనియర్ ఇన్స్పెక్టర్ బోయిన ఓదెలు, ఎస్ కే దాస్, జమిదర్ జి రాజయ్య ఇనుప సామాగ్రి వ్యాన్ వెంబడించి పట్టుకున్నారు..వ్యాన్‌ను ఎస్ అండ్ పిసి ఆఫీస్‌కు తరలించి దాని పరదా తీసి పరిశీలించగా అందులో సింగరేణికి చెందిన రోలర్స్, స్టాండ్స్ ఇతర ఇనుప సామాగ్రి ఉన్నాయని అన్నారు.అనంతరం సింగరేణి సామాగ్రితో ఐచర్ వ్యాన్ ను మందమర్రి పోలీస్ స్టేషన్కి ఇతరులించామని తెలియజేశారు.

# సేంద్రీయ సాగుతో నాణ్యమైన దిగుబడులు

**మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ**

**జననినాదం, కాగజ్ నగర్ 11:** సేంద్రీయ వ్యవసాయంతో నాణ్యమైన పంటలను పండించవచ్చని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. కాగజ్ నగర్ మండలంలోని కోసిని గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వరరావు సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతు పొలంలో జీవామృతం తయారీ విధానం,



వినియోగంతో పాటు పంటల సాగులో అవలంబిస్తున్న వివిధ సాంస్కృతిక, సహజ వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. జీవామృతం వినియోగం ద్వారా నేల సారాన్ని పెంపొందించుకోవడం, పంటల ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడంపై రైతుకు పలు సూచనలు చేశారు. సేంద్రీయ సాగుతో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు.సేంద్రీయ వ్యవసాయాన్ని విస్తరించేందుకు రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం, ప్రభుత్వ సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని రామకృష్ణ తెలిపారు. సేంద్రీయ సాగు చేసే రైతులకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సృజన, శ్రీనివాస్, ఏటీఎం శ్రీనివాస్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఆగస్టు 17 నుంచి 25 వరకు తీజ్ ఉత్సవాలు...

*డిచ్ పల్లి ,తెలంగాణ విశ్వవిద్యాలయం,తెలంగాణ విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం జరుపుకునే తీజ్ పండుగ ఉత్సవాలు, ఈ సంవత్సరంలో కూడా జరుపుకుంటున్నామని తెలియజేయడం జరిగింది. బంజారాల యొక్క పవిత్రమైన పండుగగా భావించే తీజ్ ఉత్సవాలు ఆగస్టు 17 నుండి 25 వరకు (తొమ్మిది రోజులు) భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటామని తెలుపుతూ తేదీలను ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ విశ్వవిద్యాలయంలోని బంజారా ప్రొఫెసర్లు మరియు టీచింగ్ , నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.*



## విద్యావ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి ఆగష్టు 11:** ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పథకం, వంటశాల, రిజిస్టర్లు, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే చర్యలలో భాగంగా చేపట్టిన అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ముల్కల్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్య బోధన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కోతీరాంపూర్‌లో ఘనంగా మైసమ్మ తల్లి బోనాలు

### దసరా నాటికి నూతన ఆలయం నిర్మిస్తాం ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్ ఆగస్టు 11:** కోతీరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని మైసమ్మ తల్లి ఆలయం వద్ద మంగళవారం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. సరస్వతి నగర్, గిద్దె పెరుమాండ్ల కాలనీవాసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి శాశ్వత ఆలయం నిర్మించాలని భక్తులు కోరగా, వచ్చే దసరా నాటికి ప్రజల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మిస్తామని గంగుల హామీ ఇచ్చారు. శివశక్తుల పూనకాలు, మహిళా భక్తుల బోనాలతో వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కాలనీవాసులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గుడుంబా దందాపై పోలీసుల దాడి

### 7 లీటర్ల గుడుంబా.. 50 లీటర్ల పాకం పట్టివేత

**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి ఆగష్టు 11:** మండలంలోని కోతపల్లి గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. జైనూర్ సీఐ ఆధ్వర్యంలో లింగాపూర్ ఎస్ఐ, సిబ్బంది కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 7 లీటర్ల గుడుంబా, 50 లీటర్ల పంకం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడిన సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. గ్రామాల్లో అక్రమ మద్యం తయారీ, విక్రయాలను అడ్డుకునేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.



## రేకుల షెడ్డు మంజూరు చేయాలని వినతి

**జననినాదం, తిర్యాణి 11:** మండలంలోని మర్కగూడ గ్రామపంచాయతీ పరిధి పుర్కగూడలో రేకుల షెడ్డు మంజూరు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. గ్రామ ప్రజల అవసరాల దృష్ట్యా షెడ్డు మంజూరు చేయాలని కోరారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆత్రం సక్కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పుర్క నాగు పటేల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు తుంరం గోపాల్, దుర్గ ధర్మరావు, గ్రామస్థులు పాల్గొన్నారు



## పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక దృష్టి

**పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలి**
**తరగతి గదిలో వంట చేయడం పట్ల కలెక్టర్ అసంతృప్తి..**
**వంట గదిలో మాత్రమే మధ్యాహ్న భోజనం తయారు చేయాలని ఆదేశం**
**పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి**
**విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలి**
**రఘునాథపల్లి మండలం, కోమల్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ**
**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ11:** మంగళవారం, జిల్లాలోని రఘునాథపల్లి మండలం, కోమల్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, ఏకరూప దుస్తుల పంపిణీ, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజన నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన స్థాయి, పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరిశీలించారు. 5వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. అని హెడ్ మాస్టర్ ను అడుగగా, 13 మంది విద్యార్థులు ఉన్నట్లు కలెక్టర్ కు వివరించారు. అదే విధంగా పాఠశాలలో మొత్తం 45 మంది విద్యార్థులు ఉన్నట్లు హెడ్ మాస్టర్ ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, తరగతి గదుల్లో బోధనా విధానం పర్యవేక్షించి, పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులు అందాయా? అనిఉపాధ్యాయులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల అదనపు తరగతి గదుల భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, గోడలు, విద్యుత్, తలుపుల ఏర్పాటు, ప్లాస్టరింగ్ వంటి నిర్మాణ పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలోని తరగతి గదిలోనే వంట చేస్తున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుకునే తరగతి గదులను వంట కోసం వినియోగించడం సరికాదని తెలిపారు. మధ్యాహ్న భోజనం కోసం ఏర్పాటు చేసిన వంట గదిలోనే వంట చేయాలని ఆదేశించారు. వంట సమయంలో పొగ, వేడి, ఆహార పదార్థాల వల్ల తరగతి గదులు అపరిశుభ్రంగా మారడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుతూ, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణ, టాయిలెట్స్, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా చెత్త, వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతరం శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని అదేశించారు. ఈ పరిశీలనలో హెడ్ మాస్టర్ జాన్, సర్పంచి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**విద్యార్థుల ప్రవేశాలు పెరిగిన పాఠశాలలకు అవసరమైన మేర ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి**
**జిల్లాలో ఏ పాఠశాల కూడా సింగిల్ టీచర్ పాఠశాలగా ఉండకూడదు**
**ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల లభ్యత, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా పర్యవేక్షణ ఉండాలి**
**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ11:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్, విద్యా శాఖ అధికారి సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, విద్యా శాఖ అధికారి సందీప్ కుమార్ ఝా ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రవేశాలు పెరిగిన పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పాఠశాలల తనిఖీలు, తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపు ఉండేలా వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య అవసరానికి మించి ఉండగా, మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండే పరిస్థితి ఉండకూడదన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి, అవసరమైన మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఏ పాఠశాల కూడా సింగిల్ టీచర్ పాఠశాలగా ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. “ఫోకస్‌తో పనిచేస్తే విద్యా రంగంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. ప్రతి చర్య చివరికి విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా ఉండాలి'' అని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, బోధనా ప్రక్రియ, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు. ”మిషన్ శిఖరం” కార్యక్రమం కింద జిల్లాలోని ప్రతి పాఠశాల పరిస్థితిపై స్పష్టమైన నివేదిక వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా పకడ్బందీగా రూపొందించాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఏ పాఠశాలలోనైనా భవనం, తరగతి గదులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులకు సంబంధించి మరమ్మతులు అవసరమైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణంలో చదువుకునేలా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని అన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, ఉపాధ్యాయుల కేటాయింపులో అవసరాన్ని ప్రాధాన్యతగా తీసుకొని, ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు ముందుగా సర్దుబాటు చేయాలని ఆదేశించారు. మహిళా ఉపాధ్యాయులకు అవసరమైన సందర్భాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పాఠశాలల అవసరాలు, విద్యార్థుల సంఖ్య, బోధనా పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని అఖీబ (క్లస్టర్ రిసోర్స్ టీచర్లు) తమ పరిధిలోని పాఠశాలలను నిరంతరం సందర్శిస్తూ, విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. అఖీలు కేవలం నివేదికలు సమర్పించడం కాకుండా, పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ సపోర్ట్ అందించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ అకాడమీ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. అదే విధంగా ‘ఫాస్ట్ మ్యాథ్స్’ పుస్తకాలను విద్యార్థులతో నిరంతరం సాధన చేయించాలని సూచించారు. గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి, వేగం, ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందించేలా రోజువారీ అభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి పాఠశాల, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి అధికారి తమ బాధ్యతను పూర్తి స్థాయిలో నిర్వర్తిస్తూ విద్యార్థుల ప్రయోజనమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, తదితరులు పాల్గొన్నారు.



## నేదునూరి పిలుపుయువశక్తి మేలుకో నీ దేశాన్ని ఏలుకో

ఆలోచిస్తూ ఆలస్యం
చేయకు యువతరమా !
అడుగు ముందుకు వెయ్యి
చీకట్లను చీల్చుకుంటూ
ప్రగతి దివ్వెను వెలిగించు.
నిదుర మత్తు వదిలిపెట్టి
మేలుకో నీలో దాగున్న
సింహాన్ని మేలుకొలుపు
పట్టుదల సంకల్పం ప్రగతి
సాధనకు మార్గాలుగా
ఎంచుకోనిరాశల నిస్పృహలను
తరిమికొట్టి ఆకాశమే హద్దుగా
దూసుకుపో ఆత్మవిశ్వాసమే
ఆయుధంగాలక్ష్య సాధనలో
ముందుకెళ్లుజాతిని నడిపించే
చైతన్య రథానివి నీవుదేశ
భవిష్యత్తును మార్చే
అస్త్రానివి నీవుకులమతాల
గోడలు బద్దలుకొట్టి సమ సమాజ
నిర్మాణానికి నడుం బిగించు
స్వార్థపు ఆలోచనలు వీడి
సమరశంఖం పూరించి
అవినీతి అంతానికి పంతం పూను
పాలకుల తప్పిదాలను ప్రశ్నించే
గొంతుక కావాలి నీవు
అభివృద్ధి బాటలో అడుగులు
వేయి నేర రాజకీయాల రొంపిని
కడిగే గంగవు కావాలి
కుళ్ళు రాజకీయాలను కూకటి
వేళ్ళతో పెకిలించాలి
నేర రాజకీయాలనుఅడ్డుకో
నేరగాళ్ల గుండెల్లో
సింహస్వప్నమై నిలిచిపో
ఓటును నోటుకు అమ్మే
సంస్కృతిని అంతం చేయి
నిప్పు లాంటి నాయకత్వాన్ని
నువ్వే నిర్మించుజాతిని
నడిపించే చైతన్య రథానివి
నీవుదేశ భవిష్యత్తును
మార్చేఅస్త్రానివి నీవుకుల
మతాలగోడలు బద్దలుకొట్టి
సమసమాజనిర్మాణానికి
నడు బిగించు స్వార్థపు
ఆలోచనలు వీడి సమర
శంఖం పూరించు
అవినీతి అంతానికి పంతం
బూనాలి అభివృద్ధి బాటలో
అడుగులు వేయాలి.నేర
రాజకీయాల రొంపిని
కడిగేసే గంగవు కావాలి
కుళ్ళు రాజకీయాలను
కూకటి వేళ్ళతో పెకిలిం
చాలి.భయపడక భరత
మాతసంకెళ్ళను తెంచాలి
నీ స్వచ్ఛమైన పాలనతో
దేశాన్ని నడిపించాలి.
దేశమంటే మట్టి కాదు
దేశ మంటే మనుషులోయ్
ఆ మనుషుల గుండెల్లో
ఆశల దీపానివి కావాలి




ఓయువశక్తి ఆలస్యం చేయక ఇక మేలుకో
నీజ్ఞానంతో శ్రమతో ఈదేశాన్ని ఏలుకో !
చరిత్రను చదివే నిస్సహాయుడిగా మిగిలిపోకు
నూతన చరిత్ర లిఖించే నాయకుడివి కావాలి.రేపటి ప్రగతి
నీఅడుగులతోనే మొదలవ్వాలి నీనవభారత స్వప్నం
నలుదిక్కుల సాకారం కావాలి యువశక్తి మేలుకో దేశ
భవితను ఏలుకో (ఆగస్ట్ 12అంతర్జాతీయ
యువజన సంవత్సరం సందర్భంగా
రాసిన కవిత)

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం ,మాజీ ఎన్ ఎస్ ఎస్ అధికారి**
**రచయిత కాలమిస్ట్**
**కరీంనగర్**



Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460